క్లుప్తంగా

పార్టీ విజయానికి కృషి చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నియమితులైన వారు పార్టీ విజయానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు కడప పార్లమెంట్ నియోజక వర్గాలకు సంబంధించి మండలాల వారీగా అధ్యక్షులను నియమించారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు విష్ణు ప్రితమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వారికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు మద్దిలేటి డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా సమితి సమావేశం కడప నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 9న కర్నూలు నగరంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాయలసీమ జిల్లాల సదస్సును ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

7న చలో కలెక్టరేట్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7న నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణు గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా కార్యకర్తలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26వేలు ఇచ్చి రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తల యూనియన్ నాయకురాలు శోభారాణి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

7, 8న ప్రత్యేక పూజలు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన శ్రీ గోవిందమాల భక్తబృంద సేవా సమితి గురు, శుక్ర వారాల్లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. స్థానిక మున్సిపల్ స్టేడియంలో గురువారం ఉదయం 7.00 గంటలకు సుప్రభాత సేవతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 5.00 గంటలకు మహిళలచే కుంకుమార్చన, 6.30 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 5.00 గంటలకు సుప్రభాతం, 9.00 గంటలకు శ్రీనివాస కల్యాణం , సాయంత్రం 5.00 గంటలకు కల్యాణమూర్తుల గరుడసేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

నేడు పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి రచించిన 'మిణుగురులు' పుస్తకావిష్కరణ సభ బుధవారం సాయంత్రం 5.00 గంటలకు నిర్వహించనున్నట్లు డాక్టర్ అంబేడ్కర్ మిషన్ ప్రతినిధి బండి ప్రసాద్ తెలిపారు. కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రముఖ వైద్యులు, సాహితీవేత్త డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారని తెలిపారు.

రెఫ్రిజిరేటర్ వితరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని నిర్మల జనరల్ హాస్పిటల్‌లో దీర్ఘకాలిక రోగుల సేవాశ్రయానికి రెఫ్రిజిరేటర్‌ను వితరణగా అందజేశారు. కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ మాట్లాడుతూ తమ బ్యాంకు 118వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ రాజశేఖర్, మెయిన్ బ్రాంచ్–2 చీఫ్ మేనేజర్ శ్రీకాంత్, హాస్పిటల్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్ : మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. సంబంధిత సమస్యలను పరిష్కరించడంతోపాటు ఉన్నత పాఠశాలల్లో అన్ని పోస్టులు అప్‌డేట్ చేయాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని మంగళవారం కడప మున్సిపల్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, జిల్లా ట్రెజరర్ నరసింహారావు, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరీ, నాయకులు పాల్గొన్నారు.

7,8న జాతీయ సదస్సు

కడప ఎడ్యుకేషన్ : ఈ నెల 7,8 తేదీల్లో యోగి వేమన విశ్వ విద్యాలయంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు కన్వీనర్ ఆచార్య సిస్ షావల్లిఖాన్ తెలిపారు. దేశ నలుమూలల నుంచి పరిశోధకులు, శాస్త్రవేత్తలు, ఆచార్యులు ఈ సదస్సులో పాల్గొని వివిధ అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పించనున్నట్లు, చర్చించనున్నట్లు తెలిపారు.

నూతన నియామకం

కడప ఎడ్యుకేషన్ : అఖిల భారత విద్యార్థి సంఘం(ఎఐఎస్‌యు) రాయలసీమ అధ్యక్షుడిగా కడపకు చెందిన సిపి నాగేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు జాతీయ వైస్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షులు సాయి కృష్ణ తదితరులు సిపి నాగేంద్రను ఎన్నుకున్నట్లు అపాయింట్‌మెంట్ లెటర్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలను నిర్వహిస్తామని తెలిపారు.

కడపను కమ్మేసిన ముసురు



ఫక్కీరుపల్లెకు పోయే మార్గంలో..



ఆర్టీసీ బస్టాండు వద్ద హీరో షోరూం ఎదురుగా..



గురుకుల్ విద్యాపీఠ్ సమీపంలో ...

- రోజంతా వాన జల్లులు
- జలమయమైన రహదారులు
- లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన వరదనీరు

కడప కార్పొరేషన్ : మిచౌంగ్ తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి వర్షం నిర్విరామంగా కురిసింది. మంగళవారం ఉదయం కూడా దట్టమైన మేఘాలు కమ్ముకొని చిరుజల్లు కురుస్తూనే ఉంది. చల్లటి ఈదురుగాలులు వీస్తుండటంతో జనం చలితో వణికిపోయారు. వర్షానికి వీధి వ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. రాత్రంతా వర్షం కురవడం వల్ల నగరంలోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి.

ఆర్టీసీ బస్టాండు, క్రిష్టా సర్కిల్, గోకుల్ సర్కిల్, అప్సర థియేటర్, ఫక్కీరుపల్లె, గురుకుల్ విద్యాపీఠ్ ప్రాంతాల్లో రహదారులపై వరదనీరు నిలిచింది. నంద్యాల నాగిరెడ్డి కాలనీ, గౌస్ నగర్, గంజికుంట కాలనీ, వరదకాలనీ, ఎస్‌బీఐ కాలనీ, బుడగజంగం కాలనీ, రామరాజుపల్లె, ప్రకాష్ నగర్, నిరంజన్ నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, శివానందపురం, ఓం శాంతి నగర్, మాసాపేట, తిలక్ నగర్, శాంతినగర్, రామక్రిష్ణ నగర్, బుడ్డాయపల్లె, ఖలీల్ నగర్ ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు ఇళ్లలోకి వరదనీరు చేరింది. రహదారుల విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాలైన ఏడురోడ్ల కూడలి, గోకుల్ సర్కిల్, క్రిష్ణా సర్కిల్, ఎన్‌జీవో కాలనీ, వై జంక్షన్, అంబేడ్కర్ కూడలి, మార్కెట్ యార్డు కూడలి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. వర్షం వల్ల పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని గంటల తర్వాత విద్యుత్‌ను పునరుద్ధరించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

కడప అగ్రికల్చర్ : మిచాంగ్ తుఫాన్ కారణంగా నీట మునిగిన వరిపంటను జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు పరిశీలించారు. మంగళవారం కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డితో కలిసి మండల పరిధిలోని పాతకడప, పాలెంపల్లె గ్రామాల్లో నేలకొరిగిన వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంటలో నీరు నిలవకుండా వెంటనే గట్టును తెగగొట్టి వర్షపునీటిని బయటకు పంపాలని రైతులకు సూచించారు. వర్షం తగ్గిన వెంటనే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని (5 గ్రాముల ఉప్పును లీటర్ నీటికి కలిసి) ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని తెలిపారు. దీంతో గింజలు నలుపురంగు మారకుండా ఉంటాయని తెలిపారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప ఏడీఏ సుబ్బారావు, ఏఈఓలు పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

మనిషి జీవనానికి నీరు, నేలే మూలం

కడప అగ్రికల్చర్ : మనిషి జీవనానికి నీరు, నేలే ముఖ్యమని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కడప ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రపంచ నేలల దినోత్సవం–2023ను పురస్కరించుకుని శాస్త్రవేత్తలు, డీలర్లు, రైతుల చర్చాగోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస ఆచారి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట పంటల సాగు, కంపోస్టు వినియోగంలో కడప జిల్లా అన్ని జిల్లాలకంటే ముందున్నదని అన్నారు. ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ ఎం జాంసన్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస ఆచారి నేల, నీటి ప్రాముఖ్యత, వాటి కాలుష్యానికి దారితీస్తున్న పరిస్థితులు, సంరక్షణ మార్గాల గురించి వివరించారు. ఆత్మ డీపీడీ పద్మలత మాట్లాడుతూ భూమి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

కర్బనశాతాన్ని పెంపొందించడానికి చెక్క, ఎఫ్‌వైఎఫ్ వంటి వాటిని ఖచ్చితంగా వాడాలని సూచించారు. అనంతరం డీలర్లకు సర్టిఫికెట్స్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో కడప ఏడీఏ సుబ్బారావు, పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు శ్రీవల్లి, భాగవతప్రియ, క్రిష్ణప్రియ, మాధురి, కేవీకే, డాట్ సిబ్బంది, కోరమాండల్ ప్రైవేటు లిమిటెడ్ సిబ్బంది, డీలర్లు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్టూడెంట్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్‌రెడ్డి

చెన్నూరు : మండలానికి చెందిన తనను వైఎస్సార్ సీపీ జిల్లా స్టూడెంట్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తుమ్మల సాయికుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య, యూనియన్ అధ్యక్షుడు దత్తసాయిలు ఈ మేరకు తనను నియమించి తనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ యూనియన్ నాయకులు కల్లూరు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు

మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించుకుందాం

పెండ్లిమర్రి : రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మిలు పిలుపునిచ్చారు. మండలంలోని మాచునూరు సచివాలయంలో మంగళవారం ఏపీ సీఎం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా మార్చారని కొనియాడారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డు, మానమ్మకం నువ్వే జగనన్న జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ లావణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని కోగటం గ్రామంలో బుధవారం అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సభాస్థలం పరిశీలన

చెన్నూరు : మండలంలోని కొండపేటలో ఈనెల 10వ తేదీన జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర సభాస్థలిని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ అధ్యక్షుడు పులి సునీల్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డిలు మంగళవారం పరిశీలించారు. సభాస్థలి ప్రాంగణం అలాగే పార్కింగ్ సదుపాయం తదితర విషయాలపై వారు కొండపేట స్థానిక, మండల నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

హౌసింగ్ నిర్మాణ పనులను వేగవంతం చేయండి

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. పట్టణంలోని ఐదవ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడు గృహ నిర్మాణం పూర్తి చేసే లా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. హౌ సింగ్ శాఖ ఏఈ రామకృష్ణ, నోడల్ అధికారి దాశరథి పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటేనే రాణిస్తారు

కడప ఎడ్యుకేషన్ : సమయపాలన, నిరంతర సాధన చేస్తూ నైపుణ్యం పొందినవారే రాణిస్తారని యోగి వేమన విశ్వ విద్యాలయం ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి అన్నారు. కెరీర్ అభివృద్ధి కోసం ఉపాధి నైపుణ్యాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ కార్యశాల ముగింపు సమావేశం ఉప ప్రధానాచార్యులు ఆచార్య శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రఘునాథరెడ్డి మాట్లాడుతూ సానుకూల దృక్పథం అలవర్చుకోవాలన్నారు. మంచి విషయాలను వెంటనే అమల్లోకి తీసుకోవాలన్నారు. అందివచ్చిన అవకాశాలను వెంటనే సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన తుంకూరు విశ్వవిద్యాలయం ఆచార్యులు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విధుల్లో రాణించాలన్నా నైపుణ్యాలు ముఖ్యమన్నారు. సృజనాత్మకత లేనివారు పోటీ ప్రపంచంలో రాణించలేరన్నారు. ఎస్ఆర్ క్రియేషన్స్ మైండ్స్ ప్రైవేటు లిమిటెడ్ సీఈఓ సునిల్‌రెడ్డి మాట్లాడుతూ



మాట్లాడుతున్న వైవీయూ ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి

కార్యశాలలో ప్రతిభ చూపిన 10 మంది విద్యార్థులకు మిషన్ 1000 అనే ప్రాజెక్టులో తీసుకుని 80 వేల విలువ కలిగిన శిక్షణ ఉచితంగా ఇస్తామన్నారు. జాతీయ కార్యశాల నిర్వహణ కన్వీనర్ కౌన్సిలింగ్ అండ్ గైడ్ అండ్ సెల్ లలిత మాట్లాడారు. ఎస్ఎస్ఎస్పీ సునిత, మైనార్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ రియాజున్నీసా, కార్యశాల నిర్వహణ కార్యదర్శి డాక్టర్ సరిత, సిజి సెల్ సభ్యులు, కో కన్వీనర్ లాజర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సరిత తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి



చెన్నూరు : దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కమలాపురం : తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షానికి పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్ర త్తలు తీసుకోవాలని ఏఓ సరస్వతి తెలిపారు. సోమ వారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి మండలంలో 38.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ వర్షం ధాటికి పలు చోట్ల పంటలు నీట మునిగాయి. చదిపిరాళ్ల పొలంలో మినుము పంట పెరికి అక్కడే ఉంచడంతో విత్తనాలు మొసులొచ్చాయని బాధిత రైతు రామ లింగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 4 ఏకరాల్లో మినుము పంట సాగు చేశానని, పంట నూర్పిళ్లు కూడా చేశానని, ఇంటికి చేర్చే సమయంలో వర్షం రావడంతో మొసులొచ్చాయని, దాదాపు లక్ష రుపాయలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా మండల ఏఓ సరస్వతి చదిపిరాళ్ల, గొల్లపల్లె తదితర గ్రామాలలో ఆమె పర్యటించారు. పంట పొలాలను సందర్శించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ముఖ్యంగా వరి పంటలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గట్లు తెంచి నీరు పొలాల నుంచి బయట కు వెళ్లేలా చూడాలన్నారు. అలాగే కొతకు వచ్చిన వరి కాడలను కలిపి ముడి వేయాలన్నారు. అప్పుడు గింజలు తడవవు అన్నారు. అలాగే మిగిలిన పంటలను కూడా జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. వర్షం తగ్గిన తర్వాత సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతుల కు సూచించారు. వీఏఏ లాలిత్య, రైతులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

చెన్నూరు : మండలంలో మిచాంగ్ తుఫాను వల్ల దెబ్బతిన్న పంటలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి, స్థానిక ప్రజా ప్రతినిధులు పరిశీలించారు. మండల వ్యాప్తంగా 250 ఎకరాలలో వరి, అలాగే 150 ఎకరాలలో జొన్న, 75 ఎకరాలలో మినుము పంటలు దెబ్బతిన్నట్లు అగ్రికల్చర్ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. చిన్నమాచుపల్లి, ఉప్పరపల్లి, గుర్రంపాడు, రాచిన్నాయపల్లి, ముండ్లపల్లి, శివాలపల్లి, చెన్నూరు తదితర గ్రామాలలో పంట నష్టం వాటిల్లినట్లు వారు తెలిపారు. ఈ నష్టాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళుతామని మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి తెలిపారు. మండల వ్యవసాయ సలహాదారులు ఎర్రసాని మోహన్‌రెడ్డి, తహసీల్దార్ పటాన్ అలీఖాన్, మండల కో ఆప్షన్ నెంబర్ వారిష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

వల్లూరు : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కోట్లూరులో నేల కొరిగి దెబ్బతిన్న వరి పంటను రాష్ట్ర హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డితో కలిసి జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐతా నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. కోత దశలో వున్న వరి పొలంలో మొలకలు వస్తుండటాన్ని గమనించారు. అనంతరం రైతులలో పంట నష్టం గురించి ఆరా తీశారు. కోత దశలో వున్న వరి పంట చేతికొచ్చే సమయంలో నేలకొరిగి మొలక వస్తుండటంతో నష్టపోవాల్సి వస్తోందని, తమను ఆదుకోవాలని రైతులు విన్నవించారు. పంట నష్ట వివరాల నివేదికను ప్రభుత్వానికి పంపుతామని, నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి కృషి చేస్తామని వారు రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు మస్తాన్, పుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ఆర్ఎం గోపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో రీజియన్ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు పీవీ శివారెడ్డి, నాగముని, సుధాకర్‌లు కోరారు. మంగళవారం జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డికి వారు వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ కేంద్ర కార్యాలయం జారీ చేసిన 1/2019 సర్క్యులర్‌ను అన్ని డిపోలలో అమలు చేయాలని, నగేష్ అనే డ్రైవర్‌ను సస్పెండ్ చేశారని, ఆయనకు చెల్లించాల్సిన సగం వేతనాన్ని గత ఎనిమిది నెలలుగా చెల్లించడం లేదన్నారు. డిపోల నుండి ఉద్యోగులను వివిధ కారణాల చేత కౌన్సెలింగ్ పేరిట పిలిపించుకుని అపాయ్‌మెంట్ ఇవ్వకుండా మూడు, నాలుగు రోజులు తిప్పుకుని ఆబ్సెంట్ మార్కు వేసే పద్ధతికి స్వస్తి పలకాలన్నారు. ఇంకా పలు సమస్యలను ఆయన విన్నవించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంద్రయ్య, భానుప్రసాద్, కేశవరెడ్డి, శివుడు, వీటీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

కడప ఎడ్యుకేషన్ : శ్రీనివాస విద్యాసంస్థల అధినేత బి. శ్రీనివాసులు జన్మదిన వేడుకలను మంగళవారం కడప శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్స్ నాగరాజు, బాలక్రిష్ణ, అధ్యాపకులు లక్ష్మీభరత్, నరేష్‌కుమార్, నాగమల్లికార్జున, ప్రసాద్‌రెడ్డి, ఛరీస్మాలు ఆయనకు పూలబుకేతోపాటు శాలువా కప్పి గజ పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీనివాసులను గజమాలతో సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

ఘనంగా అష్టబంధన కుంభాభిషేకం

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీ వెంకటరమణుడి ఆలయంలో ఈనెల 2వ తేదీనుంచి ప్రారంభమైన అష్టబంధన కుంభాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం శిఖరాగ్ర కలశాలకు నది జలాలతో సంప్రోక్షణను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆలయంలో తదితర అభిషేకాలు నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల ఆదేశాల మేరకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ప ట్టు వస్త్రాలను ఆలయ కమిటీ సభ్యులు మిట్టా కరుణాకర్ చేతులమీదుగా అందజేశారు. అర్చకులు మాట్లాడుతూ 12 ఏళ్లకొకసారి జరిగే ఈ



స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు కరుణాకర్, తదితరులు

అష్టబంధన కుంభాభిషేక కార్యక్రమాన్ని ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్నామన్నారు. గురువారం స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

పులివెందుల రూరల్ : ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డెమో ఆఫీసర్ రమణమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని భాకరాపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆ శాడే కార్యక్రమంలో భాగంగా డాక్టర్ శాంతి కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లకు పీసీపీఎన్‌డీటీ చట్టం, గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల వ్యతిరేక చట్టం మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూ టీ డెమో ఆఫీసర్ మాట్లాడుతూ ఆడ శిశువుల సంఖ్య పెరగాలంటే పీసీపీఎన్‌డీటీ చట్టం గురించి అందరికి వివరించాలని.. అలాగే లింగ నిర్ధారణ చేసు కుని ఆడపిల్ల అని తెలిసిన వెంటనే అబార్షన్ చేయించుకున్న వారికి జరిమానా, జైలు శిక్షతోపాటు ఆ సెంటర్లను మూసివేస్తారన్నారు. ఆరోగ్య శాఖ అందిస్తున్న అన్ని సేవల గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. ఆరోగ్య శ్రీ పథకం గురించి ప్రజల కు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ డాక్టర్ సతీష్‌కుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, ఐసీటీసీ వెంకటసుబ్బయ్య తదితరులు



మాట్లాడుతున్న డిప్యూటీ డెమో ఆఫీసర్ రమణమ్మ

పాల్గొన్నారు.

లింగ నిష్పత్తిపై అవగాహన

ఎర్రగుంట్ల : మండల పరిధి చిలంకూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో లింగ నిష్పత్తిపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. డీఈఎంఓ భారతి మాట్లాడుతూ 1000 మంది మగ పిల్లలకు 770 మంది ఆడ పిల్లలు ఉన్నారన్నారు. ఆడపిల్లల నిష్పత్తి తగ్గిపోతోందని సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానం అన్నారు. భ్రూణ హత్యలు నేరమని చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిచరితరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి, మల్లయ్య, కుమారి, సీహెచ్‌ఓ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు